క్లుప్తంగా

పుట్టపెద్దమ్మకు పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మకు జ్యేష్ఠమాసం మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో పుట్ట అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. అలాగే అమ్మవారిశాలలో వాసవీ మాతకు, కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవి, సిమెంట్ నగర్ గ్రామంలో వెలసిన సుంకులా పరమేశ్వరీ దేవి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జయరాం

డోన్ : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అధికారులు అప్రమత్తంగా ఉంటూప్రజలను చైతన్య పరచాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. మున్సిపల్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన ప్రభుత్వ, ప్రైవేటు వైద్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సీజన్‌లో డెంగీ, మలేరియా, డయేరియా లాంటి వ్యాధులు ప్రబలుతాయని, వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలన్నారు. వ్యక్తిగత, పరసరాల శుభ్రత ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని సూచించారు.

వర్షం కోసం పూజలు

డోన్ : వర్షం కోసం గ్రామీణులు పూజలు నిర్వహిస్తున్నారు. మండల పరిధిలోని గుమ్మకొండ గ్రామంలో మంగళవారం మహిళలు తంగెడు చెట్టుకు కప్పను కట్టి ఇంటింటికి తిరిగి జలాభిషేకాలు చేయించారు. రైతుల ఇచ్చిన కానుకలను స్వీకరించారు. ఇలా చేయడం వలన వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండుతాయని గ్రామీణ ప్రజల నమ్మకం.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

బేతంచెర్ల: ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు సూచించారు. శుక్రవారం డ్రైవర్స్ కాలనీలోని ఆరోగ్య ఉపకేంద్రంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా వైద్యురాలు తస్లీమా, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ వారానికి ఒక్కసారి డ్రైడే పాటించాలని, ఇంటి పరిసరాల్లో ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

వాసవీ విద్యా దీవెన పథకానికి విరాళం

డోన్ టౌన్ : శ్రీకన్యాకాపరమేశ్వరి, ఆవోపా సంయుక్త ఆధ్వర్యంలో పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం చేస్తున్న వాసవీ విద్యాదీవెన పథకానికి తమవంతుగా దాతలు విరాళాన్ని అందించారు. దాతలు శృంగారపు బోసు, జయశీలన్ గుప్త ఒక్కొక్కరు రూ. 10 వేలు అందజేశారని ఆవోపా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

బేతంచెర్ల: పీఎం కిసాన్ ఈకేవైసీ పెండింగ్ ఉన్న రైతులు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏఓ కిరణ్ కుమార్ మంగళవారం తెలిపారు. పీఎం కిసాన్ ఈకేవైసీ చేయించుకపోతే రైతులకు కేంద్ర ప్రభుత్వం అందించే ప్రోత్సాహం వర్తించదన్నారు. మండలంలోని ఆయా గ్రామాల రైతులు మీసేవా కేంద్రాలు లేదా రైతుసేవా కేంద్రాలకు వెళ్లి అగ్రికల్చర్ అసిస్టెంట్స్, ఎంపీఈఓలను సంప్రదించాలని సూచించారు.

రేపు వారాంతపు సంతకు వేలం పాట

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలో ప్రతి మంగళవారం నిర్వహించే వారాంతపు సంత కోసం గురువారం సాయంత్రం లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయితీ కార్యదర్శి భాస్కర్‌రావు మంగళవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేలం పాట నిర్వహిస్తున్నామని చెప్పారు. పాటలో పాల్గొనదలచిన వారు ముందుగా రూ. 20 వేలు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్‌పై కేసు

అవుకు: అవుకు మండలంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న జయశేఖర్ రెడ్డిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కిరణ్ తెలిపారు. ఆయన ఆరు నెలలుగా విధులకు గైర్హాజరయ్యాడు. దీంతో తనకు జీతం ఇవ్వలేదని జయశేఖర్ రెడ్డి మద్యం సేవించి మండల ప్రజా పరిషత్ కార్యాలయానికి వచ్చాడు. ఎంపీడీఓ మల్ రెడ్డిపై, సిబ్బందిపై దురుసుగా వ్యవహరించాడు. ఒకానొక సమయంలో రాయితో కొడతానంటూ బెదరించాడు. దీంతో తమ విధులకు ఆటంకం కలిగించారని ఎంపీడీఓ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

వృద్ధురాలికి ఆశ్రయం

డోన్ : కన్న కొడుకు, మనవడు అకాల మృతితో పట్టణానికి చెందిన చాకలి ఉసేనమ్మ కన్న కూతురికి భారమైంది. దిక్కుతోచని ఆ వృద్ధురాలు ఆత్మాభిమానంతో యాచక వృత్తి చేసుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంది. ఆమెదుస్థితిని గమనించిన స్థానికులు కొందరు వైఎస్‌ఆర్ నగర్‌లోని ఆదరణ వృద్ధాశ్రమం నిర్వాహకులు జాన్ ప్రభాకర్‌కు ఆమెను అప్పగించగా ఆశ్రయం కల్పించారు.

ఊపందుకున్న ఖరీఫ్ సాగు

- బోరుబావుల కింద వరి సాగుకు సిద్ధం అవుతున్న రైతన్న
- మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమంటున్న వ్యవసాయాధికారులు



వరి నారుమడి

బేతంచెర్ల : ఖరీఫ్ సాగు ఊపందుకుంది. వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ అయ్యారు. వర్షాధారంపైనే ఆధారపడిన మండల రైతులు కంది, మొక్కజొన్న, మినుము, సజ్జ, కొర్ర తదితర పంటలు పంటలు సాగు చేస్తున్నారు. అయితే బోరుబావులు ఉన్న రైతులు వరి సాగు విస్తారంగా చేస్తారు. రంగాపురం, యంబాయి, ముద్దవరం, గూటిపల్లె, అంబాపుర, సంకలాపురం, గోర్లగుట్ట తదితర గ్రామాల్లో జూలై, ఆగస్టు మాసాల్లో వరిసాగు చేపడుతారు. ఈ మేరకు నారుమళ్లుపోసే పనుల్లో నిమగ్నమయ్యారు రైతులు. వరి సాగులో మెలకువలు పాటిస్తే దిగుబడలు అధికంగా వస్తాయని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. నాట్లు వేసే ముందు ఆఖరి దమ్ములో సూపర్ ఫాస్ఫేట్ ఎకరాకు 100 కిలోలు, యూరియా 20 కిలోలు, పొటాష్ 15 కిలోలు వేసుకోవాలని ఏఓ కిరణ్ కుమార్ సూచించారు.

- నారు ఎదగకుండా నాట్లు వేయరాదు.
- నారుతీసి కట్టలు కట్టినప్పుడు, నాట్లు వేసేటప్పుడు కొనలు తుంచేయాలి. ఇలా చేస్తే నారుమడి నుంచి ఆకుముడత, కాండం తొలుచు పురుగును ప్రధాన మడికి రాకుండా నివారించుకోవచ్చు.
- 25నుంచి 30 రోజుల వయసు కలిగిన నారును కుదురుకు ఒకటి లేదా రెండు మొనలు మించకుండా నాటాలి.
- ప్రతి చదరపు మీటరుకు దీర్ఘకాలిక రకాలైతే 33, మధ్యకాలిక రకాలైతే 44, స్వల్పకాలిక రాకాలైతే 66 మొక్కల వరకు నాటుకోవచ్చు.
- నాట్లు వేసేటప్పుడు ప్రతి రెండు మీటర్లకు ఒక వరుస కాలిబాట తీసుకుంటే మొక్క మొదలుకు గాలి, వెలుతురు బాగా తగిలి ఎక్కువ పిలకలు తొడగడానికి అవకాశం ఉంటుంది.
- పొలమంతా మొక్కల సాంద్రత ఒకే విధంగా ఉంటే ఆశించిన దిగుబడి సాధించవచ్చు.
- వేసిన నాట్లు నిలదొక్కుకున్న దగ్గర నుంచి చిరుపొట్ట దశ వరకు పొలం బురదగా ఉంటే సరిపోతుంది.
- చిరు పొట్ట దశ నుంచి గింజ గట్టిపడే వరకు బురద పదును ఏమాత్రం తగ్గకుండా నీరు ఉండాలి.

కలుపు నివారణ మందులు

- నాటిన నాల్గు రోజుల్లోపు కలుపు నివారణ మందులు వేయాలి.
- ఆక్సాడయార్జిల్(టాప్‌స్టార్)30 గ్రాములను 20 నుంచి 25 కిలోల పొడి ఇసుకలో కలిపి పొలంలో చల్లుకోవాలి. గడ్డి, తుంగజాతి వెడల్పాటి ఆకులు కల్గిన కలుపు మొక్కలను నివారిస్తుంది.
- 80 గ్రాముల పైరిజో సల్ఫరాన్ ఇథైల్ మందును పైవిధంగానే పొడి ఇసుకతో కలిపి చల్లుకుంటే ఊడ, రాకాసి తుంగజాతి మొక్కలను నివారిస్తుంది.
- డ్రమ్ సీడర్ వెదజల్లు విధానాన్ని అనుసరించే రైతులైతే పెండి మిథలిన్ మందును నాటిని 48 గంటలలోగా1 లీటరు మందును 200 లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలి. ఏకవార్షిక, గడ్డిజాతి, వెడల్పు ఆకు కలుపు మొక్కలను ఇది నివారిస్తుంది.

- నాట్లు వేసిన 15నుంచి 30 రోజుల మధ్యలో పిలకలు పెరుగుతాయి.
- 20 రోజుల వ్యవధిలో ఒకరోజు పొలాన్ని ఆరగట్టిన తరువాత నీరు పెడితే పిలకలు బాగా పెరుగుతాయి.

కోవెలకుంట్ల సబ్ రిజిస్ట్రార్‌గా హాజిమియా

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల సబ్ రిజిస్ట్రార్‌గా హాజిమియాను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సర్వేశ్వనాథ్ గత నెల 30న పదవీ విరమణ పొందారు. ఆ స్థానంలో కర్నూలులో పనిచేస్తున్న హాజిమియాను తాత్కాలిక సబ్ రిజిస్ట్రార్‌గా నియమించినట్లు అధికార వర్గాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– లింగాల ఆర్‌అండ్‌బీ రహదారిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు.. మండలంలోని బిజనవేముల గ్రామానికి చెందిన జిలాన్‌బాషా సొంత పనుల నిమిత్తం బైక్‌పై కోవెలకుంట్ల వచ్చి పని ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. పట్టణ శివారులోని జుర్రేరు వాగు వంతెన సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. గాయపడిన జిలాన్‌బాషకు కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం 108 అంబులెన్స్‌లో నంద్యాలకు తరలించారు. రోడ్డు ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

ప్రమాదకరంగా శంకలాపురం బ్రిడ్జి



శంకలాపురం గ్రామ సమీపాన కూలడానికి సిద్ధంగా ఉన్న బ్రిడ్జి

బేతంచెర్ల : మండల పరిధిలోని శంకలాపురం గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న చిన్న పాటి బ్రిడ్జి ప్రమాదకరంగా ఉంది. ఈ రహదారి గుండా నిత్యం ఐదు గ్రామాల ప్రజలు బేతంచెర్లకు వస్తుంటారు. సుమారు 18 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ గోడలు శిథిలావస్తకు చేరుకుంది. మధ్యలో వర్షం నీరు నిలిచి ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతనంగా బ్రిడ్జి నిర్మించాలని, వాహనదారులకు సౌకర్యంగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు విన్నవిస్తున్నారు.

బాలిక విద్యను ప్రోత్సహించాలి



విద్యార్థినులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్ : మండలంలోని దేవనగర్ గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో మంగళవారం ఆడపిల్లల చదివే ఇంటికి వెలుగు– బాలిక విద్యను ప్రోత్సహిద్దాం కార్యక్రమం నిర్వహించారు. బాలిక విద్య ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్‌ఎస్ బ్రహ్మానంద ఆచారి నోట్ పుస్తకాలు, పెన్నుల పంపిణీ చేశారు. తల్లిదండ్రులు బాలికలను తప్పనిసరిగా చదివించాలని, అన్నివిధాలుగా ప్రోత్సహించాలని ఆయన సూచించారు.

విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్న బీజేపీ

- 4న దేశ వ్యాప్త సమ్మె



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌నాయక్

డోన్ టౌన్ : నరేంద్రమోడీ ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకుడు రమేష్ నాయక్, మండల కార్యదర్శి అశోక్ విమర్శించారు. విద్యా రంగాన్ని కాపాడాలని కోరుతూ ఈ నెల 4న చేపట్టనున్న దేశ వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం సంఘం అధక్షుడు మహాబూబ్‌బాషా అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రం విద్యా హక్కులను కాలరాస్తూ స్వయం ప్రతిపత్తిని దెబ్బ తీసే విధంగా వ్యహరిస్తుందన్నారు. ఎన్‌టీఏ లాంటి సంస్థలను రద్దు చేయాలని, నీట్ పరీక్ష రాసి నష్టపోయిన విద్యార్థులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మహేంద్ర, శివకాంత్, గిడ్డయ్య,సోమనాథ్‌రెడ్డి, విజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి

బేతంచెర్ల: దేశవ్యాప్తంగా విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పాలక ప్రభుత్వాలు పరిష్కరించాలని కోరుతూ జూలై 4న నిర్వహించే దేశవ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను జయప్రదంచేయాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్‌ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రైవేట్ కార్పొరేట్ విద్యావ్యవస్థల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

సమాజంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక గౌరవం



బాలసుబ్బారెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కొలిమిగుండ్ల: సమాజంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక గౌరవం ఉందని ఎంఈఓ అబ్దుల్ కలాం అన్నారు. కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బాలసుబ్బారెడ్డి పదవీ విరమణ పొందడంతో ఆయనను మంగళవారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఆయనకు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. బాలసుబ్బారెడ్డి అందించిన సేవలను ఈ సందర్భంగా ఎంఈఓ గుర్తు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం హుశేనయ్య, రిటైర్డ్ ఎంఈఓ నాగముని, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సన్మానం



వైద్యులను సత్కరిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు



డాక్టర్ గ్రేస్‌ను సత్కరిస్తున్న ఇన్నర్వీల్‌క్లబ్ సభ్యులు

డోన్ : డాక్టర్స్ డే సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్, డాక్టర్ సుంకన్నతో పాటు ప్రైవేట్ వైద్యులు డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, డాక్టర్ అమర్‌నాథ్‌గౌడ్‌ను మంగళవారం స్థానిక క్లబ్ ఆవరణలో రోటరీక్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. డాక్టర్లకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. అదేవిధంగా డాక్టర్స్ డే సందర్భంగా ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ గ్రేస్‌ను ఇన్నర్వీల్‌క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు రాజా విజయ్‌కుమార్, శంకర్‌గౌడ్, జగన్మోహన్, నాగరాజు, దశరథరామిరెడ్డి, జింకల క్రిష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, బలరాం, శేఖర్‌యాదవ్, నాయక్, వెంకట్రాముడు, బోయ శేఖర్‌బాబు, రఫి, మల్లారెడ్డి, గౌండ శాలు తదితరులు పాల్గొన్నారు.

ఇన్నర్వీల్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

డోన్ : స్థానిక ఇన్నర్వీల్‌క్లబ్ నూతన భవనంలో మంగళవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అధ్యక్షురాలుగా మద్దమ్మ, కార్యదర్శిగా శకుంతల, కోశాధికారిగా పద్మజలను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నట్లు క్లబ్ ప్రతినిధి శైలజ తెలిపారు. కార్యక్రమంలో ఇన్నర్వీల్‌క్లబ్ ప్రతినిధులు వనజ, శ్యామల, శ్రావణి, రాజేశ్వరి, ఇంద్రావతి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

రేనాటిగడ్డ ఖ్యాతి చాటిన బీవీ

- ఉపముఖ్యమంత్రిగా, స్పీకర్‌గా పదవులకు వన్నె తెచ్చిన బీవీ
- రేపు 121వ జయంతి



బీవీ సుబ్బారెడ్డి(ఫైల్)

కోవెలకుంట్ల: దివంగత బీవీ సుబ్బారెడ్డి పేరు చెప్పగానే రేనాటి గడ్డగా పిలువబడుతున్న కోవెలకుంట్ల ప్రాంతం గుర్తుకొస్తుంది.ఉపముఖ్యమంత్రి, స్పీకర్ పదవులకు వన్నె తెచ్చిన పట్టణానికి చెందిన దివంగత బీవీ సుబ్బారెడ్డి 121 జయంతిని గురువారం నిర్వహించేందుకు ఆయన వంశస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. 1952లో నియోజకవర్గం ఏర్పడి మొదటిసారిగా శాసనసభ ఎన్నికలు జరిగాయి. 1955లో పట్టణానికి చెందిన బీవీ సుబ్బారెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి పెండేకంటి వెంకటసుబ్బయ్యపై విజయం సాధించారు. 1962లో కాంగ్రెస్‌పార్టీ తరపున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1967లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఇండిపెండెంట్ అభ్యర్థి కొర్రపాటి రామిరెడ్డిపై గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు. బీవీ హయాంలో అనేక ప్రాంతాల్లో గ్రామీణ ప్రజలు రోడ్లు, విద్యుత్ సౌకర్యం పొందారు. కోవెలకుంట్ల నియోజకవర్గం నుంచి ఐదు పర్యాయాలు ఎమ్మెల్యే గెలుపొందడమేకాక రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, స్పీకర్‌గా పనిచేశారు. బీవీ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా, పది సంవత్సరాలపాటు శాసనసభ స్పీకర్‌గా పనిచేసి రేనాటిఖ్యాతిని నలువైపులా వ్యాపింప చేశారు.



కోవెలకుంట్లలో ఏర్పాటు చేసిన బీవీ సుబ్బారెడ్డి మోమెరియల్ పార్క్

ఎట్టి పశువులను గోశాలలకు తరలిస్తాం

డోన్ : పట్టణ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఎట్టిపశువులను గోశాలలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కొందరు పశువుల యజమానులు వేకువజామున వీధుల్లోకి వదులుతుండటంతో వాహనదారులు, పాదాచారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయన్నారు. ఈ విషయంపై పలుమార్లు పశువుల యజమానులకు సమాచారం అందించినా స్పందించలేదని, ఎట్టి పశువులను బందెల దొడ్డికి తరలిస్తామని ఆయన హెచ్చరించారు.

ప్రతి కొనుగోలుకు రశీదు ఇవ్వాలి

ప్యాపిలి: ఫర్టిలైజర్స్ దుకాణాల్లో రైతులకు ప్రతి కొనుగోలుపై రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలని ఏడీఏ అశోక్‌వర్దన్ రెడ్డి తెలిపారు. స్థానిక మూడో సచివాలయంలో మంగళవారం ఫర్టిలైజర్స్ దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఏఓ రాజేశ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్స్ దుకాణదారులు అనుమతులు ఉన్న పెస్టిసైడ్స్, విత్తనాలు, ఎరువులనే విక్రయించాలన్నారు. దుకాణాల్లో తప్పనిసరిగా ధరల పట్టిక ఏర్పాటు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు, విత్తనాలు విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గురు,శిష్యుల బంధం చాలా గొప్పది



లక్ష్మణ మూర్తి దంపతులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

బేతంచెర్ల: పూర్వకాలం నుంచి నేటి వరకు గురు,శిష్యుల బంధం చాలా గొప్పదని రిటైర్డ్ ఉపాధ్యాయుడు లక్ష్మణ మూర్తి పేర్కొన్నారు. పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో గణిత, ఆంగ్ల ఉపాధ్యాయుడిగా సేవలందించిన రిటైర్డ్ లక్ష్మణ మూర్తిని మంగళవారం పూర్వ విద్యార్థులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, పూర్వవిద్యార్థులు బాబుల్ రెడ్డి, సత్తార్, గుండా గోపాల్, నూర్ అహ్మద్, వీరభద్రారెడ్డి, జనార్ధన్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసు నమోదు

డోన్ టౌన్ : మైనర్ బాలికను ప్రేమ పేరుతో ఓ యువకుడు లైంగికదాడికి పాల్పడినట్లు బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి నిందితునిపై అత్యాచారం, పోక్సో, కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కొండపేటకు చెందిన యువకుడు నాసీర్ (19) చిగురమానుపేటకు చెందిన ఒక మైనర్ బాలికను రెండేళ్లుగా ప్రేమిస్తున్నట్లు నమ్మించాడు. ఈనెల 1వ తేదీ బాలికలను తీసుకెళ్లి లైంగికవాంఛ తీర్చుకుని మంగళవారం ఇంటి వద్ద వదిలేసి వెళ్లాడు. ఈ విషయంపై బాధితురాలి తల్లి గట్టిగా నిదీయగా బాలిక అసలు విషయం చెప్పింది. దీంతో బాధితురాలి తల్లి పట్టణ పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు.

రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి



బేతంచెర్ల పట్టణంలో నిరసన తెలుపుతున్న విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ సభ్యులు

బేతంచెర్ల: పార్లమెంట్ సాక్షిగా హిందువులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ హిందూ సమాజానికి వెంటనే క్షమాపణలు చెప్పాలని విశ్వహిందూ పరిషత్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, మండల గౌరవ అధ్యక్షులు హుసేన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రాహుల్ వ్యాఖ్యలను తప్పుపడుతూ విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్, హిందూ సేవా సంస్థల ఆధ్వర్యంలో బేతంచెర్లలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన రహదారి మీదుగా పాతబస్టాండ్ వరకు నిరసన ర్యాలీ సాగింది. రాహుల్‌కు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఎన్నికల ముందు హిందువుల ఓట్ల కోసం నేను హిందువునని చెప్పి ఇలా మాట్లాడం మంచి పద్ధతి కాదన్నారు. హిందుస్తాన్‌లో ఉన్నవారందరూ హిందువులేనని, ఆరాధన పద్ధతులు, జీవన విధానం వేరుకావచ్చన్నారు. రాహుల్ గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ నాయకులు, హిందూ సోదరులు హరి, శ్రీనివాసులు, నాగమోహన్, భరణి, రవి, ఆంజనేయులు, గూని నాగరాజు, డక్కి శేఖర్, శేషా మోహన్, లక్ష్మీనారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాబు, పవన్ కళ్యాణ్ నీట్ రద్దు కోసం లేఖలు రాయాలి



మాట్లాడుతున్న తెలుగు విజయ్‌కుమార్

డోన్ టౌన్ : నీట్ పరీక్షను రద్దు కోరుతూ సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేంద్రానికి లేఖలు రాయాలని ఎస్‌ఎస్‌యూఐ జిల్లా అధక్షుడు తెలుగు విజయ్‌కుమార్, మండల నాయకులు సాహిద్, మధు కోరారు. స్థానిక కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నీట్ రద్దు కోరుతూ ఈ నెల 4న చేపట్టనున్న దేశ వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు హర్ష, మధు, సూర్యనారాయణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జుర్రేరువాగు పిచ్చి మొక్కల మయం!



జుర్రేరువాగును కప్పేసిన పిచ్చిమొక్కలు

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణ నడిబొడ్డున ఉన్న జుర్రేరువాగులో పిచ్చిమొక్కలు పెరడంతో వాగులో నీటిప్రవాహానికి ఇబ్బందిగా మారింది. పాతపాడు సమీపంలో ఉన్న దద్దణాల ప్రాజెక్టు, ఎస్‌ఆర్‌బీసీ ద్వారా వచ్చే నీటి కారణంగా వర్ష కాలంలో ఈ వాగులో నిత్యం నీటి ప్రవాహం ఉంటుంది. అయితే వాగులో పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగి నీటిప్రవాహానికి ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఇళ్లలోని చెత్తతో పాటు ఇతర వస్తువులను వాగులో ఎక్కడపడితే అక్కడ వేస్తున్నారు. నీటి ప్రవాహం లేకపోవడంతో మురుగునీటిలో దోమలు వ్యాప్తి చెందాయి. మలేరియా వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. మైనర్ ఇరిగేషన్ అధికారులు ఇప్పటికైనా స్పందించి జుర్రేరువాగులో పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.